మరో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition

భక్తుల కష్టాలు గాలికొదిలి ఆర్భాటాలకే ప్రాధాన్యం

■ **విజయవాడ ఉత్సవ్ పేరిట బాబు సర్కార్ డ్రామాలు! : మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తీవ్ర విమర్శలు**



విజయవాడ: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కనకదుర్గమ్మ దర్శనానికి తరలివస్తున్న భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వం.. ఆ బాధ్యతను గాలికొదిలేసి 'విజయవాడ ఉత్సవ్' పేరిట ఆర్భాటాలకు ప్రాధాన్యమిస్తోందని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విజయవాడ ఉత్సవ్ పేరుతో చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న హడావుడి వల్ల భక్తులు, నగర ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి కేటాయించకుండా వ్యాపారులపై ఆర్థిక భారం మోపుతూ ఉత్సవాలు నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు.

భక్తుల సేవ కంటే ఆర్భాటాలే ముఖ్యమా?

ఒకవైపు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల హడావుడి.. మరోవైపు ఇంద్రకీలాద్రిపై ప్రభుత్వ పెద్దల హంగామా కొనసాగుతుండగా, అధికార యంత్రాంగాన్ని విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాల్లో నిమగ్నం చేయడం దారుణమని మల్లాది విష్ణు మండిపడ్డారు. ఈ ఏడాది కొత్తగా 'సరస్' కార్యక్రమాన్ని కూడా తీసుకొచ్చారని, భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు ఇతర కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు.

ఎంపీ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకేనా?

విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని కేంద్రంగా ఈ ఉత్సవాల హడావుడి సాగుతోందని మల్లాది విష్ణు విమర్శించారు. ఎంపీగా కేంద్ర ప్రభుత్వం నుంచి విజయవాడ అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకురావడంలో విఫలమైన ఆయన, ఇప్పుడు నగరానికి ప్రత్యక్ష ప్రయోజనం లేని కార్యక్రమాలపై దృష్టి పెట్టారని ఆరోపించారు.

వ్యాపారులపై చందాల ఒత్తిడి

నగరంలోని పారిశ్రామికవేత్తలు, హోటళ్ల నిర్వాహకులు, వస్త్ర వ్యాపారులు, చాంబర్ ఆఫ్ కామర్స్‌తో పాటు దాదాపు 200 వ్యాపార సంఘాలను ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నారని పేర్కొన్నారు. లైటింగ్, డెకరేషన్లు ఏర్పాటు చేయాలని, రూ.25 వేల చొప్పున చందాలు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు.

గతేడాది వసూళ్ల లెక్కలేవీ?

విజయవాడ ఉత్సవ్ పేరిట పెద్దఎత్తున నిధులు వసూలు చేస్తున్నారని, గతేడాది సేకరించిన మొత్తానికి సంబంధించిన జమాఖర్చులను ఇప్పటివరకు నగర ప్రజల ముందు ఉంచలేదని మల్లాది విష్ణు విమర్శించారు.వందేళ్లకు పైగా ఘనమైన చరిత్ర కలిగిన విజయవాడ నగర చారిత్రక ప్రాశస్త్యాన్ని, అభివృద్ధికి పాటుపడిన మహనీయుల సేవలను ప్రజలకు తెలియజేయాల్సింది పోయి డ్యాన్సులు, పాటలు, పాశ్చాత్య సంస్కృతి ప్రదర్శనలకే ప్రాధాన్యమిస్తున్నారని విమర్శించారు.